క్లుప్తంగా

వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచే విషయంలో విద్యార్థులు బాధ్యత వహించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని మంగళవారం సందర్శించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వంట గది, స్టాక్ రూమ్, పరిసరాల్లో పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులు సైతం సహకరించాలని సూచించారు. పంచాయతీ ఈవో జగన్నాథం ఉన్నారు.

'పిల్లలపై ఒత్తిడి వద్దు'



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్

ఇచ్ఛాపురం రూరల్: చదువు విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురావద్దని కొళిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. ఈ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు సోమవారం రాత్రి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో పిల్లలు అలసిపోయి ఇంటికి వస్తారని, మరల పదేపదే చదవాలంటూ వారిని ఆదేశించరాదని, తేలికగా జీర్ణం అయ్యే ఆహారాన్ని ఇవ్వాలని, అర్ధరాత్రి వరకు చదివించరాదని సూచించారు. రికార్డు అసిస్టెంట్ ఉప్పాడ పాపారావు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి తరఫున ప్రచారం



ప్రచారంలో యూటీఎఫ్ ప్రతినిధులు

సంతబొమ్మాళి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్ కోరారు. సంతబొమ్మాళిలోని ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలను మంగళవారం సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు చట్టసభల్లో మద్దతుగా నిలిచే పీడీఎఫ్ అభ్యర్థిగా ఉన్న విజయగౌరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నారాయణరావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ గణపతిరావు, జిల్లా అకాడమిక్ సెల్ కో–కన్వీనర్ బాడాన రాజు, జనవిజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ, మండల అధ్యక్షులు పాపారావు, డి.రాము ఉన్నారు.

15న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



మాట్లాడుతున్న ఎంఈవో ధనంజయమజ్జి

కవిటి: పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం వేళలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ధనంజయమజ్జి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కవిటి మండల విద్యాశాఖ కార్యాలయంలో ఐదు స్కూల్‌కాంప్లెక్స్ సెంటర్ల చైర్మన్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 15వ తేదీన అన్ని పాఠశాలలో మధ్యాహ్నభోజనం ప్రక్రియ సజావుగా పూర్తిచేసి రెండవ పూట నిర్దేశిత సమయానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి విధిగా హాజరుకావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో బొరివంక, కవిటి, రాజపురం, బెలగాం, ముత్యాలపేట, మాణిక్యపురం కాంప్లెక్స్ చైర్మన్లు సనపల రామకృష్ణ, బి.మల్లేశ్వరరావు, శివరాంప్రసాద్‌పాఢి, నామితాకుమారి సాహూ, జి శాంతి, బండారు సుమలత పాల్గొన్నారు.

19 లీటర్ల సారాతో ఇద్దరు అరెస్టు

సోంపేట: బారువ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల నుంచి 19 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. గొల్లూరు గ్రామానికి చెందిన సూరు రామారావు వద్ద నాలుగు లీటర్లు, జీడిపుట్టుగ గ్రామానికి చెందిన చెల్లూరు లోకనాథం వద్ద 15 లీటర్ల సారాను మంగళవారం దాడిచేసి పట్టుకున్నారు. వీరిరువురిపై బారువ ఎస్సై ఎస్.హరిబాబునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశలు ఆవిరి!

- కలిసిరాని అపరాల సాగు
- అనుకూలించని వాతావరణ పరిస్థితులు
- సోకిన తెగుళ్లు
- తగ్గిన పంట దిగుబడి



బెండి గేటు వద్ద తెగుళ్ల బారినపడిన పెసర పంట

వజ్రపుకొత్తూరు రూరల్: అపరాల పంటలు సాగు చేస్తున్న రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఖరీఫ్ పంటలు సాగు చేసిన అన్నదాత సీజన్ ముగిసిన వెంటనే రబీ సాగుకు సన్నద్ధమయ్యారు. ఎన్నో ఆశలతో పెసర, మినుము, రాగి, పొద్దుతిరుగుడు, నువ్వు తదితర పంటలను సాగు చేస్తున్నారు. పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇతర పెట్టుబడుల కోసం వందలాది రూపాయలు ఖర్చు చేశారు. అయితే పంట ప్రారంభంలో కొంతమేర వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడి బాగుంటుందని ఆశించారు. అయితే కొంతకాలంగా వాతావరణంలో వచ్చిన పెను మార్పులు పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగ, తేనే మంచుతోపాటు సాగు నీరు సకాలంలో అందకపోవడంతో పంటలకు అనేక రకాల తెగుళ్లు, పురుగులు ఆశించడంతో తీవ్ర ముప్పు వాటిల్లిందని.. దీంతో పంట దిగుబడి పట్ల తాము పెట్టుకున్న ఆశలు నీరుగారాయని రైతులు వాపోతున్నారు. పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లోని లక్ష్మీపురం, బ్రహ్మణతర్లా, గరుడఖండి, మహాదేవపురం, బట్టుపాడు, సీతాపురం, బెండి, నగరంపల్లి, కొండవూరు, మకరజ్యోల, విజిపురం, హరిపురం, కుంటికోట, పితాతోళి, గుళ్లలపాడు, అనంతగిరి, గల్లి, పాతటెక్కలి తదితర గ్రామాల్లోని రైతులు సుమారు నాలుగు వేల ఎకరాల్లో అపరాల పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలపై వాతావరణ ప్రతికూల పరిస్థితుల ప్రభావం తీవ్రంగా ఉండటంతో పంట దిగుబడి ఆందోళనకరంగా మారింది. దీంతో పాటు పంట చేతికి అందుతున్న తరుణంలో అడవిపందులు స్వైర విహారం చేస్తూ పంటను నాశనం చేస్తున్నాయి. అటు వాతావరణం అనుకూలించక ఇటు అడవిపందులు పంటలపై దాడి చేసి నాశనం చేస్తుండడంతో నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు.

పరిస్థితులు అనుకూలంగా లేవు



ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. వేలాది రూపాయలు ఖర్చు చేసిన సాగుచేస్తున్న అపరాల పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లేదు. ప్రస్తుతం మినుమ, పెసర పంటలను చూస్తుంటే ఆందోళనగా ఉంది. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– టి.జయలక్ష్మి, మహిళ రైతు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

శ్రమే మిగిలింది..



ఎన్నో ఆశలతో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి మినుము, పెసర పంటలను సాగు చేశాం. తమ ఆశలపై మంచు, తెగుళ్ల ప్రభావం చూపి పంటలను నాశనం చేశాయి. చేతికి అందిన పంటను తీస్తున్నాం. అయితే తాము పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఒట్టి శ్రమే మిగిలింది.

– డి.ఊర్వశి, మహిళ రైతు, నగరంపల్లి, వజ్రపుకొత్తూరు మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



అపరాల సాగు పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అయితే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ప్రతిఅనుకూలంగా మారాయి. దీంతో పంట దిగుబడి కొంత వరకు తగ్గుతుంది.

–కిరణ్‌వాణి, వ్యవసాయాధికారి, వజ్రపుకొత్తూరు మండలం

ప్రజల భాగస్వామ్యం అవసరం



ధర్మపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని కాశీబుగ్గ డీఎస్పీ బి.వెంకట అప్పారావు అన్నారు. ధర్మపురం, లొద్దపుట్టి గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ గ్రామస్తుల ఆర్థిక సాయంతో ముఖ్యకూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రస్తుతం చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు వంటి సంఘటనలు పల్లెల్లో సైతం అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ధర్మపురం, లొద్దపుట్టి గ్రామస్తులను ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామస్తులు ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని, సొంత ఖర్చులతో సీసీ కెమెరాల ఏర్పాటుకు పూనుకోవాలని పిలుపునిచ్చారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మృతికి సంతాపం



వీరస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు (ఇన్‌సెట్‌లో)వీరస్వామి (ఫైల్)

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దున్న వీరస్వామి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు భార్య ఆరుద్రమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియలను మంగళవారం స్వగ్రామంలో అమలపాడులో నిర్వహించారు. అమలపాడు సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడుగా సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలు అందించారు. జెడ్పీ నిధులతో ప్రధాన రహదారులు, మంచినీటి బోరుబావులు, సామాజిక, విశ్రాంతి భవనాలు నిర్మించి వజ్రపుకొత్తూరు మండలాన్ని అభివృద్ధి పథాన నిలిపారు. వీరస్వామి మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

పార్టీకి తీరనిలోటు..

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరస్వామి మృతి వైఎస్సార్‌సీకి తీరనిలోటని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వీరస్వామి మృతదేహానికి నివాళులర్పించారు. పాడిమోసి కడదాక సాగనంపారు. వీరస్వామి భార్య ఆరుద్రమ్మ కుమారులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పార్టీ నేతలు పాలిన శ్రీనివాసరావు, ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్, పలాస మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, యూజీపురం సర్పంచ్ కర్ని శ్రీను, గొరకల రామారావు ఉన్నారు.

సృష్టికి మూలం శ్రీకృష్ణుడే..



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న ధీరసంత గోస్వామి మహారాజ్

ఇచ్ఛాపురం: సృష్టికి మూలకారకుడు శ్రీకృష్ణుడే అని.. సమస్తం కృష్ణమయంతో నిండి ఉందని అంతర్జాతీయ ప్రవచకులు యూరప్ ఖండానికి చెందిన ధీరసంత గోస్వామి మహారాజ్ అన్నారు. స్థానిక శ్రీసురంగి రాజా క్రీడా మైదానం ఆవరణలో మంగళవారం సాయంత్రం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నగర సంకీర్తన చేశారు. అనంతరం మైదానంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రవచకులు మాట్లాడుతూ.. ఈ సృష్టిలో శ్రీకృష్ణుడికంటే ఉన్నతమైనది మరొకటి లేదని అన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో యూరప్ ఖండానికి చెందిన 30 మంది ఇస్కాన్ భక్తబృందం, స్థానిక ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులందరికీ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య



కవిటి: బెజ్జిపుట్టుగలో రైతుల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ జగన్మోహనరావు

వజ్రపుకొత్తూరు: భూమి కలిగిన రైతులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పి.కిరణ్‌వాణి అన్నారు. వజ్రపుకొత్తూరులో విశిష్ట నమోదు సంఖ్య ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు దీనిపై అవగాహన కల్పించారు. పీఎం కిసాన్, పంటలబీమా, అన్నదాత సుఖీభవ, పంట రుణాలపై వడ్డీ రాయితీ, యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, పంట రుణాలు, సేంద్రియ సేద్యం, పెట్టుబడి సాయం తదితర పథకాలు చెల్లింపులకు ఇది ఎంతో అవసరమన్నారు.

కవిటి: విశిష్ట గుర్తింపు సంఖ్య పొందడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని సోంపేట వ్యవసాయ సబ్‌డివిజన్ ఏడీఏ కె.జగన్మోహనరావు అన్నారు. కవిటి మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బట్టివానిపాలెం, చిన్నకర్రివానిపాలెం గ్రామాల్లో చోడి, వరిపొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ ఉన్నారు.

ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి



మున్సిపల్ కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఇందిరాచౌక్ వద్ద ఉన్న మాజీ ప్రధానమంత్రి.. దివంగత ఇందిరమ్మ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో అధికారులు తొలగించారు. దీన్ని తిరిగి ఏర్పాటు చేయాలని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. కాగా ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న పలాసకు చెందిన ప్రముఖ వైద్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావుకు ఇటీవల కాశీబుగ్గ పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం పలాస వచ్చి జీవితేశ్వరరావుకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంబటి కృష్ణారావు, పలాస నియోజకవర్గం ఇన్‌చార్జి తెంబూరి మధుసూదనరావు, నాయకులు ఉప్పాడ రాజారావు, కొర్ల హేమారావు చౌదరి, మజ్జి బాబూరావు, సాసుమాన లోకేశ్వరరావు తదితరులున్నారు.

అక్రమ నిర్మాణం వాస్తవమే

సాక్షి ఎఫెక్ట్..

టెక్కలి: కాటాబందలోని సర్వే నంబర్ 468లో రోడ్డుకు ఆనుకుని అక్రమ నిర్మాణం చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. డివిజన్ కేంద్రమైన టెక్కలి భవానీనగర్‌లోని కాటాబందలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొంత మంది అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. దీనిపై 'దర్జాగా ఆక్రమణ'శీర్షికతో మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మండల సర్వేయర్ బాలరెడ్డి, వీఆర్వో యుగంధర్, గ్రామ సర్వేయర్ దయాశంకర్ తదితరులు కాటాబందలో అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి కొలతలు వేశారు. ప్రస్తుతం నిర్మాణం చేస్తున్న దానితో పాటు మరి కొంత స్థలం ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే పనులు ఆపాలని ఆదేశించారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టినంత వరకు ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని స్పష్టం చేశారు. పరిశీలనలో సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు అందజేశారు.

విద్యార్థికి అభినందన



మదన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం టౌన్: జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఈ నెల ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకూ జరిగిన జిల్లాస్థాయి గ్రిగ్స్ అథ్లెటిక్స్ షాట్‌పుట్ క్రీడాంశంలో ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థి కొయ్య మదన్ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథం, సిబ్బంది మదన్‌ను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, శారద పాల్గొన్నారు.

మద్యం ప్రియులను మోసం చేసిన చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు



టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు మద్యం ధరలను పెంచుతూ మద్యం ప్రియులను సైతం మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నపుడు అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఇదే చంద్రబాబు విమర్శలు చేశారని.. ఇప్పుడు మద్యం ధరలు ఎందుకు పెంచారని ప్రశ్నించారు. అధికారం దక్కించుకోవడానికి సాధ్యం కాని హామీలను గుప్పించి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు అమలు చేయడం సాధ్యం కాదంటూ తప్పించుకోవడం చంద్రబాబు మోసపూరితమైన రాజకీయ చరిత్రకు నిదర్శనమన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని రామారావు అన్నారు. మంత్రి సొంత మండలం కోటబొమ్మాళిలో బెల్టు దుకాణాలు మరింత ఎక్కువగా ఉన్నాయన్నారు. మద్యం, బెల్టు దుకాణాల నుంచి మంత్రికి ముడుపులు వెళ్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు.

మిన్నంటిన సంబరం



ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మంగళవారం మొక్కుబడులు తీర్చుకునే క్రమంలో సంబరాలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్ద, కాళికావేషధారణలతో బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. పండ్లు, పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. –కవిటి

బెంచీలు వితరణ



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దాతలు సిమెంట్ బెంచీలను వితరణగా అందజేశారు. పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సమితి సభ్యులు సదాశివుని జగదీశ్వరరావు, అన్నపూర్ణమ్మ, ఉప్పాడ భాస్కరరావు, రేవతి దంపతులతో పాటు వైఎల్ నరసింహులు తదితరులు ఆరు సిమెంట్ బెంచీలను మంగళవారం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, సేవా సమితి సభ్యులు చంటి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వి.ల్యూక్‌పాల్ పాల్గొన్నారు. –టెక్కలి

గేటు వేస్తే మాకేంటి?



కాశీబుగ్గలోని రైల్వే ఎల్‌సీ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న కీపర్లు వాహనదారుల నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఒకసారి గేటుపడితే సుమారు అరగంట వరకూ వాహనాలు నిలిచిపోతుంటాయి. దీంతో చాలామంది వాహనదారులు గేటువేసే సమయంలో దాటి వెళ్లిపోవాలని తొందరపడుతుంటారు. ఓపక్క సైరన్ వేస్తూనే కీపర్ గేటు వేస్తుంటే.. వాహనదారులు మాత్రం అతనికి చాలెంజ్ విసురుతున్నట్టు ప్రమాదకరణగా గేటు దాటేస్తున్నారు. –కాశీబుగ్గ

జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీల్లో పలాస విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీల్లో పలాస ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకూ జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని కేఆర్ స్టేడియంలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభకనబర్చి పలు పతకాలు సాధించారు. ఖోఖోలో బి.తిరుమల, వై.భరత్, ఎ.భూపతి, ఎ.గిరిధర్, ఎం.ఉమామహేష్, బి.ఉదయ్‌కుమార్, డి.చందు, బి.చరణ్, బి.గౌతమ్, ఎస్.తేజేశ్వరరావు, ఆర్.మనోహర్‌లు ద్వితీయస్థానం, టెన్నికాయిట్‌లో టి.వెంకటేష్, కె.జయంత్ ప్రథమస్థానం సాధించి చాంపియన్‌గా నిలిచారు. అలాగే బాలికల విభాగంలో టెన్నికాయిట్‌లో పి.శ్రావణపాత్రో, వై.వరలక్ష్మి, నందిని, బెహరా ప్రథమ స్థానం సాధించారు. క్రీడాకారులు, శిక్షకులను పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావులను ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, బి.చిట్టిబాబు, విద్యా కమిటీ చైర్మన్ కె.తారక్ మంగళవారం అభినందించారు.

పాత స్టాకు.. కొత్త ధరలు!

- టెక్కలిలో అదనపు ధరలతో మద్యం అమ్మకాలు

టెక్కలి: మద్యం ధరలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వచ్చిన కొద్ది గంటల్లోనే దుకాణాల్లో పాత స్టాకుపై అదనపు ధరలతో అమ్మకాలు ప్రారంభించేశారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో మంగళవారం ప్రతీ మద్యం బాటిల్‌పై అదనపు ధరలతో అమ్మకాలు చేసి మద్యం ప్రియులకు కిక్కు ఇచ్చారు. సోమవారం వరకు పాత ధరలతో అనగా రూ. 99 నుంచి 450 రూపాయల వరకు బ్రాందీ, విస్కీ తదితర మద్యాన్ని క్వార్టర్, ఆఫ్, ఫుల్‌గా అమ్మకాలు చేస్తున్నారు. తాజాగా వాటి ధరలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కొత్త స్టాకు తీసుకురావాల్సి ఉన్నప్పటికీ పాత స్టాకు మద్యానికి అదనంగా డబ్బులను ముక్కుపిండి వసూలు చేయడం దారుణమని మద్యం ప్రియులు వాపోతున్నారు. పాత స్టాకుకు కొత్త ధరల వసూళ్లను ఎక్సైజ్ అధికారులకు తెలిసినప్పటికీ తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే ఇటువంటి పరిస్థితి ఉంటే బెల్టు దుకాణాల్లో ఇంకెంత మేరకు అదనపు ధరల పర్వం కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

సంక్షిప్తంగా...

17న ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాశీబుగ్గ: పలాసలోని సత్యసాయి మందిరం వద్ద ఈ నెల 17వ తేదీ ఉదయం ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేత్ర పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలకు ఆస్పత్రికి తరలిస్తామన్నారు. శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులను తీసుకురావాలని కోరారు. పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాలవారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

టెక్కలి రూరల్: స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి టెక్కలి పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. పరిమితికిమించిన వేగంతో వెళ్లిన వాహనదారులను నిలిపివేసి కౌన్సెలింగ్ చేయడంతోపాటు అపరాధ రుసుం విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది ఉన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి మద్యం, నాటుసారా అక్రమ రవాణా జరగకుండా ప్రొహిబిషన్ ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ బృందంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు స్థానిక ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.డి.ప్రసాద్, ఎస్సై జి.వి.రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు పెట్రోలింగ్ బృందంతో తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం, ఇతర మత్తుపదార్థాలను రవాణా చేస్తున్న వారిపై 27 కేసులు నమోదుచేసినట్లు పేర్కొన్నారు. ఎవరైన మత్తుపదార్థాలను రవాణా చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14405 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బస్సుల ఫిట్‌నెస్ పరిశీలన

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ డిపో గ్యారేజీలో జరుగుతున్న బస్సుల మెయింటెనెన్స్, ఫిట్‌నెస్ పనులను విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కే శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా గ్యారేజి సిబ్బందితో కలిసి షెడ్యూల్–3 బస్సును రోడ్డు టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యారేజీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డిపో మేనేజర్ ఆర్ఎస్ నాయుడు, గ్యారేజ్ ఇన్‌చార్జి హేమంత్ కుమార్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు.

ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని సీతాపురం గ్రామంలో 15వ ఆర్థిక సఘం నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రూ. రెండు లక్షలతో వంద మీటర్ల మేర సీసీ డ్రైనేజ్ నిర్మాణం, మంచినీటి బావి మరమ్మతులను చేపడుతున్నారు. ఈ పనులను సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు మంగళవారం పరిశీలించారు.

సౌత్‌కోస్ట్ రైల్వేలో చేర్చాలని వినతి

కాశీబుగ్గ: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాస, సోంపేట, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లను కొత్తగా ఏర్పడుతున్న సౌత్ కోస్ట్ రైల్వేలోని విశాఖ డివిజన్‌లో కలపాలని రైల్వే ఉద్యోగులు కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ సంఘ నాయకులు ఎం.ఉమామహేశ్వరరావు, పినకాన ఈశ్వరరావు, బేపల అయ్యప్ప, జీఎల్‌కే రెడ్డి, ఎ.రామక్రిష్ణ ఉన్నారు.